క్లుప్తంగా

గ్రామస్తుల నిరసన

జమ్మలమడుగు: గండికోట ముంపు గ్రామాల కింద 22 గ్రామాలు ఉన్నాయి. అందులో తమ గ్రామమైన సున్నపురాళ్లపల్లె కూడా ఉంది. అయితే సగం గ్రామం మాత్రమే ముంపునకు చేరి మిగిలిన వారిని ముంపు కింద చేర్చకపోవడంతో ప్రస్తుతం తాము ఇబ్బందులు పడుతున్నామంటూ కొండాపురం మండలం సున్నపురాళ్లపల్లె గ్రామస్తులు వాపోతున్నారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన చేపట్టారు. సీపీఐ నాయకుడు సుబ్బారెడ్డి మాట్లాడారు. అనంతరం ఆర్డీఓ జి.శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు.

భోజన వసతి

వేముల : మండల పరిధిలోని నల్లచెరువుపల్లె గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఆర్.జనార్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సోమవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులందరికి భోజన వసతి ఏర్పాట్లు చేయడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెస్టారెంట్ పరిశీలన



పర్యాటక శాఖ ఈఈతో చర్చిస్తున్న ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

లింగాల : మండల పరిధిలోని పార్నపల్లె చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌పై ఉన్న టూరిజం రెస్టారెంట్, బోటింగ్‌ను సోమవారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బోటింగ్ పనితీరు, పార్కు, రెస్టారెంట్‌లను తనిఖీ చేశారు. అక్కడి పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయని పర్యాటక శాఖ ఈఈ ఈశ్వరయ్యకు సూచించారు. రెస్టారెంట్, బోటింగ్ నిర్వహణకు త్వరలో టెండర్లను ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్నపల్లె నాయకులు రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు నిషేధం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో ప్లాస్టిక్స్ ఫ్లెక్సీల వినియోగం పూర్తిగా నిషేధం విధించినట్లు, ఈ నిషేధం కూడా ఈ నెల 26వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని మున్సిపల్ కమిషనర్ పి జగన్నాథ్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో ప్లాస్టిక్స్ ఫ్లెక్సీలు తయారు చేయడం, ప్రదర్శించడం నిషేధమన్నారు.

ఇళ్ల స్థలాల పరిశీలన



నందిపల్లెలో ఇళ్ల స్థలాల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వేంపల్లె : మండలంలోని కత్తలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మిట్టపల్లె గ్రామస్తులకు సంబంధించి ఇళ్ల స్థలాలను సోమవారం జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఆ గ్రామంలో కొన్ని ఘటనలు చోటు చేసుకుంటున్న కారణంగా గ్రామస్తులందరూ ఊరిని వదిలేస్తామని అప్పటి కలెక్టర్‌కు విన్నవించారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ వి.విజయరామరాజు నందిపల్లె గ్రామంలో వారికి స్థలాలు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులకు అనువైన స్థలాన్ని నందిపల్లెలో కేటాయించడం కోసం స్థల పరిశీలన చేయడం జరిగిందన్నారు. గ్రామంలో 50కుటుంబాల వరకు ఉన్నాయని.. ప్రభుత్వం ఇళ్ల స్థలాలను చూపిస్తే గ్రామస్తులే సొంతంగా ఇళ్లను నిర్మించుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లోకేష్, సర్పంచ్ ఎం.సులోచనమ్మ, వైఎస్సార్‌సీపీనాయకులు ప్రసాద్‌రెడ్డి, వీరలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులకు ఫోన్ ద్వారా ఆరోగ్య సేవలు

జమ్మలమడుగు: గర్భవతులకు, ఒక ఏడాది వయసు ఉన్న బిడ్డల తల్లులకు ఇకపై ఫోన్‌ల ద్వారా ఆరోగ్య సేవలను అందించడం జరుగుతుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్సీకాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. అనంతరం పట్టణంలోని సాయి భరద్వాజ నర్సింగ్‌హోంను తనిఖీ చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ముద్దనూరు: గుడిలో దీపం వెలిగిస్తూ ఆ దీపం అంటుకుని తీవ్రంగా గాయపడిన నాగమ్మ(75) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. సీఐ మోహన్‌రెడ్డి సమాచారం మేరకు.. మండలంలోని యామవరం గ్రామంలో గుడిలో రోజూ దీపం వెలిగించే నాగమ్మ ఈనెల 14వ తేదీన దీపం వెలిగించి వెనుతిరుగుతుండగా ఆమె చీరకు దీపం మంట అంటుకుంది. దీంతో నాగమ్మ గాయాలపాలైంది. స్థానికంగా చికిత్స అనంతరం ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు.రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

కన్యకాంబ.. నమోస్తుతే

కమలాపురం: పట్టణంలోని పొట్టిశ్రీరాములు రోడ్డులో వెలసిన అమ్మవారి శాలలో శ్రీ మత్కన్యకా పరమేశ్వరీ దేవి ఆత్మార్పణ దినోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఆర్యవైశ్య, యువజన సంఘం అధ్యక్షులు కామిశెట్టి వెంకట రమణ, అంబటి సురేష్, మహిళా మండలి అధ్యక్షురాలు మాలేపాటి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌లో వెలసిన గంగమ్మ ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు102 కలశాలతో మహిళలు ఊరేగింపుగా తరలి వచ్చారు. ఊరేగింపు అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు పవన్ కుమార్ మంత్రోచ్చారణలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం పుష్ప యాగం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని మెయిన్ బజారులో వెలసిన శ్రీ వాసవి కన్యాకపరమేశ్వరీ ఆలయంలో శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి మాత ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

వల్లూరు: వల్లూరులో వెలసిన శ్రీ ఆర్య వైశ్య కళ్యాణ భవనంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆత్మార్పణ దినాన్ని సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పవిత్ర జలాలతో నిండిన కలశాలతో అమ్మవారిశాల వరకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు వారికి పూజలు చేసి ఆహ్వానించారు. ఆ జలాలతో వాసవీ మాతకు అభిషేకాలను, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు ఆధ్వర్యంలో హోమాలను నిర్వహించారు. అనంతరం గుండ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు.

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సోమవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయం నుండి కలశాలతో పాలు తీసుకుని వచ్చి అమ్మవారిశాలలో ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. వాసవీ మాత పూర్ణాహుతి హోమం నిర్వహించారు. ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా గుండ ప్రవేశం ఏర్పాటు చేసి భక్తులు జై వాసవీ మాత అంటూ గుండంలో నడిచారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు జి.హరికృష్ణ మాట్లాడారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి ప్రతినిధులు, ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.




కమలాపురం: అమ్మవారి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపుగా వస్తున్న ఆర్యవైశ్యులు



వేంపల్లె : వాసవీ మాత పల్లకీ మోస్తున్న ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు



వల్లూరులో అమ్మవారి కలశాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కమలాపురం: అమ్మవారికి పుష్పయాగం నిర్వహించిన దృశ్యం



ఎర్రగుంట్ల : ప్రత్యేక అలంకరణలో శ్రీ వాసవిమాత

ఘనంగా వీరభద్రస్వామి కల్యాణం

పులివెందుల టౌన్ : పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కళ్యాణం కన్నుల పండుగలా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులతో స్వామి వారి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి భస్మాలంకరణ చేశారు. సాయంత్రం వీరభద్రస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో రంగనాథస్వామి, అంకాలమ్మ దేవస్థాన చైర్మన్లు సుధీకర్ రెడ్డి, బ్యాటరీ ప్రసాద్, ఆలయ అర్చకుడు బసవరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



భద్రకాళీసమేత వీరభద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిరుత సంచారంపై తొలగని భయాందోళన

వేముల : మండలంలోని మీదిపెంట్లకోట గ్రామంలో సోమవారం రాత్రి కారులో వెళ్తున్న వారికి చిరుతపులి కనిపించడంతో గ్రామాల్లో భయాందోళన నెలకొంది. చిరుత సంచారంపై వేంపల్లె ఫారెస్ట్ రేంజ్ అధికారులు గ్రామ సమీప ప్రాంతాలలో ఆరాతీశారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో చిరుత పులి ఎక్కడ కనిపించింది.. ఎటు నుంచి ఎటువైపు వెళ్లిందనే విషయంపై గ్రామస్తుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారులో వెళుతున్న వారు చిరుత పులిని చూసి తమకు సమాచారం ఇచ్చారని సమాధానమిచ్చారు. అయితే చిరుత సంచారంపై ఫారెస్ట్ అధికారులు పరిసర ప్రాంతాలలో చిరుత కదలికలు, అడుగు జాడలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజర్ గుర్రప్ప మాట్లాడుతూ మీదిపెంట్ల కోట గ్రామ పరిసరాలలో చిరుత పులి సంచరించిన ఆనవాళ్లు లభించలేదన్నారు. తోటలలో చిరుత అడుగులు ఏవైనా ఉన్నాయా అనే దానిపై సిబ్బందితో క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ఇకపై ఎప్పుడైనా చిరుత పులి కనిపిస్తే సమాచారం ఇవ్వాలని, కదలికలను కనిపెట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని గ్రామస్తులకు వివరించారు. అయితే మీదిపెంట్ల కోట, భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె గ్రామాల్లో చిరుత సంచారంపై ప్రజలలో భయాందోళనలు తొలగిపోలేదు. గతంలో కూడా ఈ ప్రాంతంతో చిరుత పులి సంచరించిందని గ్రామస్తులు వాపోతున్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి



మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ రెవెన్యూ చీఫ్ ఇంజనీర్ లక్ష్మీనరసయ్య

వేంపల్లె : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఏపీఎస్పీడీసీఎల్ రెవెన్యూ చీఫ్ ఇంజనీర్ లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఆయన వేముల, వేంపల్లె, చక్రాయపేట మండలాల విద్యుత్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఆదాయంలో రెవెన్యూ లోటు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా జగనన్న కాలనీలకు విద్యుత్ సరఫరా అందించడంలో చొరవ చూపాలని ఆదేశించారు. అలాగే ఆ కాలనీలకు ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా విద్యుత్ మీటర్లు బిగించాలని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వినియోగదారుల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. విద్యుత్ ఛార్జీల బకాయిలు వసూలు చేయడం, విద్యుత్ చౌర్యంపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ చీఫ్ ఇంజనీర్ ధర్మజ్ఞాని, కడప ఓఎస్డీ శ్రీనివాసులు, ఎస్ఈ మునిశంకరయ్య, డీఈ శ్రీకాంత్, ఆయా మండలాల ఏఈలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

– ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల పక్షపాతి కావడంతోనే ప్రతి నిరుపేదకు నవరత్నాల పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సంక్షేమపథకాలు అందుతున్నాయా లేదా, అందకుంటే ఎందుకు అందడంలేదంటూ ఆరాతీశారు. వెంటనే మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులను పిలిచి వారి సమస్యలను పరిష్కరిస్తూ వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండ్లులేని ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి ఇంటి స్థలం మంజూరు చేయించడంతోపాటు, ఇంటిని మంజూరు చేయిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అమలు చేసే నాయకులు దేశంలో ఒక్క జగన్‌రెడ్డి మాత్రమే ఉన్నారన్నారు. రైతులు పండించిన శనగ పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి వెంటనే వారి ఖాతాలలో డబ్బులు కూడా జమ చేస్తూ వస్తోందన్నారు. సచివాలయాలలో ఉద్యోగులు వలంటీర్ల ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురప్ప , వెంకటేశ్, ప్రభాకరరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, రామిరెడ్డి, ఓబుళరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ ఇసీ గంగిరెడ్డి జయంతి

పులివెందుల టౌన్ : మాజీ ఎంపీపీ, ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ ఇసీ గంగిరెడ్డి జయంతి వేడుకలను సోమవారం పులివెందులలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక దివ్యాంగుల భవనంలో ఆర్ఎంపీ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఇసీ గంగిరెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డిలు హాజరై డాక్టర్ ఇసీ గంగిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అలాగే స్థానిక 15వ వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో కౌన్సిలర్ పురుషోత్తం, డేనియల్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డిల చేతుల మీదుగా కేక్‌ను కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. అంగన్వాడీ కేంద్రానికి కావాల్సిన ప్లేట్లు, చాపలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాపన్న, కార్యకవర్గ సభ్యులు నాగిరెడ్డి, బాబ్‌జాన్, సురేంద్రబాబు, బాబా, సుబ్బయ్య, లిడ్‌క్యాప్ డైరెక్టర్ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రమౌళి, సూరి, కృష్ణమూర్తి, డేనియల్‌బాబు, కోళ్ల భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

ప్రయాణం కన్నా భద్రతే ముఖ్యం

పులివెందుల రూరల్ : ప్రయాణం కన్నా భద్రతే ముఖ్యమని ఎంవీఐ ప్రసాద్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా స్థానిక ఎంవీఐ కార్యాలయంలో సోమవారం డ్రైవర్లకు రోడ్డు భద్రతా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

జమ్మలమడుగు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే డ్రైవర్లు, పక్క సీటులో ఉన్న వారు కచ్చితంగా సీటు బెల్టు ధరించాలని డీఎస్పీ ఎస్.నాగరాజు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయం నుంచి జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులతో హెల్మెట్‌లు ధరించి డీఎస్పీ ర్యాలీని ప్రారంభించారు. సీఐలు సదాశివయ్య, కొండారెడ్డి, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

కొండాపురం: ప్రయాణికులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని కొండాపురం సీఐ సుదర్శన్ ప్రసాదు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో ముచ్చుమర్రి పునరావాస కాలనీ నుంచి ఓబన్నపేట పునరావాస కాలనీ వరకు బైపాస్ రోడ్డు మార్గంలో హెల్మెట్ ధరించి బైకులతో పోలీసులు ర్యాలీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ జె.రవికుమార్, కొండాపురం ఏఎస్ఐ ఉత్తమ్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె: వాహనదారులు నిబంధనలు పాటించాలని ఏఎస్సై రమేష్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంబడి హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు.

కమలాపురం: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కమలాపురం సీఐ సత్యబాబు తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన పోలీస్ సిబ్బంది, ప్రజలతో కలసి హెల్మెట్ ధరించి క్రాస్ రోడ్డు నుంచి పట్టణంలోనికి ద్విచక్ర వాహనం ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కమలాపురం, వల్లూరు ఎస్ఐలు చిన్నపెద్దయ్య, విష్ణువర్ధన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య



మృతి చెందిన సిద్దేశ్వరీ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం పరిధిలోని వినాయకనగర్ కాలనీలో నివాసం ఉండే మిట్టూరు సిద్దేశ్వరీ(18) అనే యువతి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు ఎర్రగుంట్ల ఎస్ఐ వెంకటక్రిష్ణయ్య తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటక్రిష్ణయ్య సోమవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. వినాయకనగర్ కాలనీలో నివాసం ఉండే బాబు అనే వ్యక్తికి ముగ్గురు సంతానం. వీరిలో సిద్దేశ్వరీ అనే కుమార్తె ప్రొద్దుటూరులోని అభ్యాస జూనియర్ కళాశాలలో చదువుతుండేది. అయితే చదువులో రాణించలేకపోవడంతో ఉత్తీర్ణత సాధించలేకపోతానేమోనని మనస్తాపానికి గురైంది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందింది. మృతురాలు తండ్రి బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

ముద్దనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం లబ్ధిదారులకు ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ముద్దనూరుకు చెందిన కమలాదేవికి రూ.60 వేలు, ఉప్పలూరుకు చెందిన లక్ష్మీదేవికి రూ.1 లక్షా 20 వేలు, చిన్నదుద్యాలకు చెందిన సంటి కొండమ్మకు రూ.2 లక్షల 40 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థికసాయం అందిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

అలసత్వం తగదు

వీరపునాయునిపల్లె: గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో సచివాలయ సిబ్బంది అలసత్వం వహించడం తగదని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్, సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని మొయిళ్లచెరువు సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఎన్ని సమస్యలు అందాయి.. వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ప్రజల నుంచి సమస్యలు అందగానే వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం వాలంటీర్లతో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం ప్రవేశ పెట్టినా వెంటనే ప్రతి గడపకు తెలియజేయాలని సూచించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని తెలిపారు.

నేడు వాటర్ ప్లాంట్ ప్రారంభం

లింగాల : లింగాల మండలం బోనాల గ్రామంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించనున్నారని సర్పంచ్ అనురాధ, వాటర్ షెడ్ డైరెక్టర్ వెంకట రామమునిరెడ్డిలు తెలిపారు. అదేవిధంగా బోనాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డైనింగ్ హాలు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేస్తారన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని ఏటీఎం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రంగా, మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దనూరు మండలం మద్దయ్యగారిపల్లెకు చెందిన సుమంత్ పులివెందులకు వస్తుండగా.. పులివెందులకు చెందిన హజరయ్య ముద్దనూరు రోడ్డు వైపు వెళ్తున్నాడు. ఏటీఎం వద్ద వీరు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. దీంతో సుమంత్‌కు తీవ్రంగా, హజరయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో వారిని పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో సుమంత్‌ను కడప రిమ్స్‌కు రెఫర్ చేశారు.

వెండి పడగ వితరణ



వెండి నాగపడగను అందజేస్తున్న దాతలు

ముద్దనూరు: మండలంలో బొందలకుంట గ్రామంలోని పురాతన శ్రీ బసవేశ్వరస్వామి ఆలయానికి రూ.1 లక్ష విలువ చేసే వెండి నాగపడగ (నాగాభరణం)ను దాతలు వితరణగా అందజేశారు. సోమవారం సింహాద్రిపురం మండలం జంగంరెడ్డిపల్లె గ్రామానికి చెందిన భక్తుడు చిన్న ఈశ్వరరెడ్డి అతని తల్లిదండ్రులు నాగమ్మ, బసిరెడ్డిల జ్ఞాపకార్థం ఆలయంలోని శివలింగానికి అలంకరణగా అమర్చే వెండి నాగపడగను అర్చకుడు అనిల్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత ఈశ్వరరెడ్డితో పాటు అతని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్య వ్యక్తిపై కుక్కల దాడి

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలం పైడిపాలెం గ్రామంలో కుక్కల దాడిలో అనారోగ్య వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గడ్డం నారాయణ అనే వ్యక్తి తన ఇంటి వద్ద నడుచుకుంటూ వెళుతున్న సమయంలో వెనుక వైపు నుంచి ఐదు కుక్కలు దాడి చేశాయి. వెంటనే తీవ్రంగా గాయపడ్డ వ్యక్తికి సచివాలయ ఏఎన్ఎం లక్ష్మీప్రసన్న ప్రథమ చికిత్స అందించి 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం గడ్డం నారాయణ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుక్కల బెడదతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

నిర్మాణాలలో వేగం పెంచాలి

పులివెందుల టౌన్ : జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేందుకు లబ్ధిదారులు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన మెప్మా సిబ్బంది, ఆర్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎంఎం గంగులయ్య, ఏపీఎం ఆంజనేయులు, సీఓలు నాయుడు, నాగన్న, హరిత, ఆర్పీలు పాల్గొన్నారు.

భూమి పంపిణీ చేయాలి

ముద్దనూరు: అర్హులైన పేద మహిళలకు 3 ఎకరాల భూమిని పంపిణీ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం తహశీల్దారు వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. కులాల గణాంకాల మేరకు రిజర్వేషన్ శాతాన్ని 50 నుంచి 60 శాతానికి పెంచాలని, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.